


ఐలు అభ్యర్థి అంకయ్యను గెలిపించుకుందాం



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ (ఐలు) సభ్యునిగా సత్తు అంకయ్య ఎంపికయ్యారు. ఐలు రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఇటీవల నిర్వహించారు. ఏపీ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎంపిక చేసిన అభ్యర్థి సత్తు అంకయ్యకు తప్ప మరెవ్వరికీ మద్దతు ఇవ్వడం లేదని సమావేశం స్పష్టం చేసింది. యూనియన్‌తో సంబంధం లేని వారికి తాము మద్దతు ఇవ్వడం లేదని తెలిపారు. త్వరలో జరగబోయే ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ అభ్యర్థి సత్తు అంకయ్యకు ఐలు కార్యకర్తలు, న్యాయవాదులు తమ ప్రాధాన్యత ఓటు వేసి ఐలు అభ్యర్థి గెలుపుకు కృషి చేయాల్సిందిగా పిలుపునిచ్చారు.

వైకుంఠ ద్వార దర్శనాలకు విస్తృత ఏర్పాట్లు : అదనపు ఈవో

ప్రజాశక్తి- తిరుమల



తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేది వరకు నిర్వహించనున్న వైకుంఠ ద్వార దర్శనాలకు విచ్చేసే భక్తుల రద్దీని దష్టిలో ఉంచుకుని విస్తృత ఏర్పాట్లు చేసినట్లు టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. శనివారం ఉదయం ఆయన తిరుమలలోని శిలా తోరణం వద్ద నుండి దర్శన క్యూలైన్లను అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. క్యూలైన్లలో ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయిలు, అన్న ప్రసాదం పంపిణీ, మరుగుదొడ్ల సౌకర్యాలను పరిశీలించి భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం అదనపు ఈవో మీడియాతో మాట్లాడుతూ వైకుంఠ ద్వార దర్శనాలు పురస్కరించుకుని చాలా వరకు ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశామని చెప్పారు. భక్తుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని క్యూలైన్లలో పలు మార్పులు చేపట్టామని తెలిపారు. క్యూలైన్లలో భక్తులు కూర్చునేవిధంగా ఏర్పాట్లు చేయడంతో పాటు, తాగునీటి సౌకర్యం, క్యూలైన్లకు అనుసంధానంగా అదనపు మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. మొబైల్ వాటర్‌డ్రమ్స్, మొబైల్ ఫుడ్ వ్యాన్లు ఏర్పాటు చేశామన్నారు. అదనపు ఈవో వెంట శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, అన్న ప్రసాద విభాగం డిప్యూటీ ఈవో రాజేంద్ర, హెల్త్ డిప్యూటీ ఈవో సోమన్నారాయణ, ఈఈ శ్రీనివాసులు, డిఈ చంద్రశేఖర్, ఐటీ డిప్యూటీ జీఎం వెంకటేశ్వర్లు నాయుడు, అశ్వని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

తిరుచానూరు పంచాయతీలో అక్రమ ఇంటిపన్నులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ


తిరుచానూరు గ్రామ పంచాయతీ పరిధిలోని యోగిమల్లవరం బీసీ కాలనీలో ఇల్లే లేని ప్లాటుకు ఇంటి పన్ను విధించిన ఘటన స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీసింది. యోగిమల్లవరం బీసీ కాలనీలో కె. శివప్రసాద్ (తండ్రి సుబ్బయ్య) పేరిట, అసెస్మెంట్ నెంబర్ 3841, డోర్ నెంబర్ 10-109తో జీ ప్లస్ టూ భవనం ఉన్నట్లు పంచాయతీ రికార్డుల్లో చూపించి, పంచాయతీ అధికారులు ఇంటి పన్ను విధించారు. అయితే, వాస్తవంగా ఆ డోర్ నెంబర్‌తో ఆ పేరుపై ఏ విధమైన ఇల్లు లేకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో, ఆ డోర్ నెంబర్‌కు సంబంధించిన జీ ప్లస్ టూ భవనం ఎక్కడ ఉందో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ప్రకారం వివరాలు వెల్లడించాలని శనివారం యోగిమల్లవరం స్థానికులు పంచాయతీ కార్యదర్శిని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ గత కొంతకాలంగా తిరుచానూరు పంచాయతీలో అక్రమాలు విపరీతంగా జరుగుతున్నాయని, అధికారులు, సిబ్బంది ప్రజల నుంచి విచ్చలవిడిగా అక్రమ వసూళ్లకు పాల్పడుతూ, లక్షలాది రూపాయల దో చుకుంటున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పద్మావతి అమ్మవారు కొలువైన పవిత్రమైన తిరుచానూరు పంచాయతీలో ఈ తరహా అక్రమాలు ప్రభుత్వానికి, పంచాయతీకి చెడ్డ పేరు తీసుకువస్తున్నాయని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, జిల్లా కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, తిరుచానూరు పంచాయతీలో జరుగుతున్న వ్యవహారాలపై పూర్తిస్థాయి విచారణ చేయాలని, పంచాయతీ నిధుల దుర్వినియోగం, అక్రమ వసూళ్లు, పక్కదారి పట్టిన నిధులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంచాయతీకి సమర్థవంతమైన అధికారిని నియమించి, తిరుచానూరు పంచాయతీ పరువు ప్రతిష్టను కాపాడేందుకు తక్షణ చర్యలు అవసరమని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సుమన్, శేషాద్రి, కలిముల్లా తదితరులు పాల్గొన్నారు.



అక్రమాల నిగ్గు తేల్చాలని స్థానికుల వినతి

రైల్వే జోనల్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా పిసి రాయల్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



దక్షిణ మధ్య రైల్వే జోనల్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా తిరుపతికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ పి సి రాయల్ ను నియమిస్తూ భారత రైల్వే మంత్రిత్వ శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఎయిర్పోర్ట్ అడ్వైజర్ కమిటీ సభ్యులుగా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సభ్యులుగా, సూక్ష్మ, చిన్న, మధ్య, తరహా పరిశ్రమల శాఖ, గనులు బొగ్గు శాఖ, గ్రామీణ అభివద్ధి పంచాయతీరాజ్ శాఖ సభ్యులుగా కొనసాగుతున్న డాక్టర్ పి సి రాయల్ తాజాగా రైల్వే జోనల్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. రెండు సంవత్సరాల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

ఇకపై స్మగ్లర్ల ఆస్తులు జప్తు

ఈ ఏడాది మోస్ట్ వాంటెడ్ స్మగ్లర్ల అరెస్ట్
దోషుల నిర్ధారణ రేటు 87.5 శాతం
టాస్క్‌ఫోర్స్ హెడ్ వార్షిక నివేదిక

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శేషాచలం అడవులలో మాత్రమే దొరికే అరుదైన విలువైన ఎర్రచందనం చెట్లను నరికి దుంగలుగా మలిచి అక్రమ మార్గాలలో అంతర్జాతీయ మార్కెట్‌లోకి ఇన్నేళ్లుగా తరలిస్తూ కోట్ల రూపాయలు వెనకేసుకున్న స్మగ్లర్లు ఇకపై స్మగ్లింగ్‌కు పాల్పడితే వారి ఆస్తులను జప్తు చేయడానికి టాస్క్‌ఫోర్స్ ప్రణాళికలు సిద్ధం చేసిందని ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక ప్రత్యేక కార్యదళం హెడ్ ఎల్.సుబ్బరాయుడు స్పష్టం చేశారు. శనివారం తిరుపతి పోలీస్ కేంద్ర కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్, అటవీశాఖ తిరుపతి సర్కిల్ సిసిఎఫ్ సెల్వం, టాస్క్‌ఫోర్స్ ఎస్‌పి శ్రీనివాస్, జిల్లా అటవీశాఖ అధికారి సాయిబాబా, టాస్క్‌ఫోర్స్ ఏఎస్‌పి కులశేఖర్‌లతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బరాయుడు మాట్లాడుతూ 2025వ సంవత్సరం ప్రారంభం నుండి శేషాచలం అటవీ ప్రాంతం నుండి ఎర్రచందనం దుంగలు స్మగ్లింగ్ పూర్తి స్థాయిలో నిలుపుదల చేయడానికి 40 ఏళ్ళలోపు ఉన్న సిబ్బందితో ప్రస్తుతం గుర్తించిన 816 ఎంట్రీ అండ్ ఎగ్జిట్ పాయింట్లలో 24 గంటల పాటుగా రౌండ్ ది క్లాక్ ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయడంతో మంచి ఫలితాలను సాధించామన్నారు.

న్యాయశాఖ పూర్తి సహహారంతో.....

శేషాచలం అడవుల నుండి అక్రమంగా ఎర్రచందనం తరలించుకపోతూ పట్టుబడిన స్మగ్లర్లకు న్యాయశాఖ పూర్తి సహకారంతో కేసులకు సంబంధించి ముద్దాయిలకు శిక్షలు పడ్డాయన్నారు. 2025లో కోర్టుల ద్వారా 32 కేసులను పరిష్కారం అయ్యాయన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పూర్తిగా అలవాటు పడిన ఇద్దరికి పీడియాక్టును నమోదు చేశామని టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు వివరించారు.



స్మగ్లర్ల ఆస్తులను అటాచ్ చేయడానికి.....

ఎర్రచందనం అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన స్మగ్లర్ల ఆస్తులను ఇకపై అటాచ్ చేస్తూ కొత్తగా ప్రణాళికలు చేయడం, దాని అమలుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందన్నారు. మొదటిసారి ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించి కేసు నమోదు అయితే అప్పటి నుండి అతని ఆస్తులకు సంబంధించిన వివరాలను రికార్డు చేయడం జరుగుతుందన్నారు. రెండవసారి అదే చట్టవ్యతిరేక పని చేస్తూ పట్టుబడితే ఆస్తులను జప్తు చెయ్యడానికి ప్రత్యేకంగా అధికారిని నియమించడం జరుగుతుందని అన్నారు.

2025 ప్రారంభం నుండి నేటి వరకు.....

ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధంలో భాగంగా ఈ ఏడాది ప్రారంభం నుండి నేటి వరకూ 64 కేసులను నమోదు చేసి 263 మంది నిందితులను అరెస్ట్ చేయడం జరిగిందని టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు తెలిపారు. వీరిలో రవాణాదారులు, నిర్వాహకులు, ఫీల్డ్ స్థాయి స్మగ్లర్లు, ఎర్రచందనం అక్రమ రవాణానే చేయాలని భావించే వారు ఉన్నారు. 2016 నుండి 2024 మధ్య కాలంలో ఎర్రచందనం అక్రమరవాణా కేసులు నమోదైన కాలంలో 52 మంది తప్పించుకు తిరుగుతున్న వారికి ప్రత్యేక బృందాలతో గాలించి 52 మందిని అరెస్ట్ చేశామని అన్నారు. దీని ద్వారా 35,476 కిలోల బరువు గల 1872 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకొని అక్రమ రవాణాకు వినియోగించిన 63 వివిద రకాల వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, బెంగుళూరు నగరంలోని కైకెనహెళ్ళి, సరజాపుర, మాలూర్ వంటి సున్నిత ప్రాంతాలలో 10 మంది మోస్ట్ వాటెండ్ స్మగ్లర్లను అరెస్ట్ చేశామన్నారు. అంతర్రాష్ట్ర ఆపరేషన్లలో రూ.16.5 కోట్ల రూపాయల విలువైన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

అప్పలరాజుపై పీడీ యాక్ట్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి -సూళ్లూరుపేట

ఉద్యమ నేత అప్పలరాజుపై అక్రమంగా బనాయించిన పిడి యాక్ట్‌ను రద్దుచేసి, బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శనివారం ఉదయం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. సిపిఎం నాయకులు మాట్లాడుతూ ప్రజలకు పర్యావరణానికి హాని కలిగించే బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా అక్కడి బాధితులకు అండగా అప్పలరాజు పోరాడారని, కార్పొరేట్ల కొమ్ముకాస్తున్న రాష్ట్ర ప్రభుత్వం దాన్ని జీర్ణించుకోలేక అప్పలరాజు పై కక్షగట్టి పిడి యాక్ట్ ప్రయోగించి అక్రమంగా అరెస్టు చేసిందని, వెంటనే అప్పలరాజును విడుదల చేయాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మరో పోరాటాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.అల్లేయ్య, ఎస్.కె.రియాజ్, కె.సాంబశివయ్య, సిహెచ్. సుధాకర్ రావు, అక్బర్ బాషా, పి.ఖాన్, జె.భాస్కర్, ఎస్.కె. ఫయాజ్, ఎస్.కె.అమీర్, ఎస్.కె. మాలిక్, ఎస్.కె.ఖలీల్ పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు ప్రాధాన్యత దక్కాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

గత జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎదురొడ్డి పోరాడి గద్దె దించిన బలహీన వర్గాలకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనివ్వాలని టిడిపి బీసీ విభాగం నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆ విభాగం నాయకులు ఇటీవల ఉమ్మడి జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ గా నియమితులైన రెడ్డివారి గురవారెడ్డిని సన్మానించారు. వైసిపి ప్రభుత్వ అరాచక చర్యలను ఎదుర్కొని నిలబడి, జగన్ రెడ్డిని గద్దె దించడానికి ముందుండి పోరాటాలు చేసిన బిసి, యస్సీ, యస్టీ, మైనారిటీ వర్గాలకు అటు నామినేటెడ్ పదవుల్లో, ఇటు పార్టీ పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పించలేదని వాపోయారు. బడుగులు మరింత బలపడేలా రాజకీయంగా ప్రోత్సహిస్తే వెన్నుదన్నుగా నిలబడతారని సూచించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరధాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమ, అభివ ద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం. ఉమేష్ రావు పాల్గొన్నారు.

ఐఈఈఈ విద్యార్థి కాంగ్రెస్ 'ఉమాంగ్' విజయవంతం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



తిరుపతి-కరకంబాడి మార్గంలో ఐఈఈఈ అనంతపురం సబ్ సెక్షన్, ఐఈఈఈ హైదరాబాద్ సెక్షన్ సహకారంతో శ్రీ రామ ఇంజనీరింగ్ కాలేజ్ (అటానమస్) వేదికగా ఐఈఈఈ అనంతపురం సబ్ సెక్షన్ స్టూడెంట్ కాంగ్రెస్ ఉమాంగ్ 2025 కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ అకడమిషియన్లు, ఐఈఈఈ పదాధికారులు, పరిశ్రమ నిపుణులు, వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుండి వచ్చిన అధ్యాపకులు , విద్యార్థులు హాజరయ్యారని కళాశాల అకడమిక్ డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సాంకేతిక విజ్ఞానం, ఆవిష్కరణ దక్పథం, నాయకత్వ లక్షణాలు, వత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించడం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సాంకేతిక ఉపన్యాసాలు తాజా సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమ అవసరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించామని అన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వాసు, ఐఈఈఈ కన్వీనర్ డాక్టర్ మునిశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతిలో 'జి రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ బోర్డు' : కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ బోర్డు డైరెక్టర్ల సమావేశం శనివారం కలెక్టర్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జరిగింది. కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ తిరుపతిని ఎలక్ట్రానిక్స్ స్పేస్, అడ్వాన్స్‌డ్ ఎనర్జీ సిస్టమ్స్ రంగాలలో అగ్రగామిగా నిలబెట్టడానికి బోర్డు పలు వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకుందన్నారు. ప్రాధాన్యత రంగాలైన ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్, స్పేస్ టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ ఎనర్జీ సిస్టమ్స్ వంటి ప్రధాన రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని బోర్డు నిర్ణయించిందన్నారు. తిరుపతి జిల్లాతో పాటు అనుబంధ జిల్లాల పారిశ్రామిక సామర్థ్యాన్ని అంచనా వేస్తూ, ఆ ప్రాంతాల్లోనూ స్టార్టప్‌లు, వ్యవస్థాపకతను ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, అదాని,నవయుగ, అమరరాజా కంపెనీల నుంచి పాల్గొన్నారు.

ఆరోగ్యానికి మించిన సంపద లేదు : డాక్టర్ విశాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటి



మనిషి జీవితం ప్రశాంతంగా సాగాలంటే ఆరోగ్యం ముఖ్యమని, ఆరోగ్యానికి మించిన సంపద లేదని మెడిగో ఆసుపత్రి డాక్టర్ గీతికా, మహిళా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ విభాగం అధికారిణి డాక్టర్ విశాలి అన్నారు. నేషనల్ సర్వీస్ స్కీం యూనిట్ వన్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా తిరుపతి రూరల్ పరిధిలోని పాతకాల్వ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణి చేసారు. ఈ సందర్భంగా డాక్టర్ విశాలి, డాక్టర్ గీతికా మాట్లాడుతు చలికాలంలో సంక్రమించే సీజనల్ వ్యాదులపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా చలికాలంలో జలుబు, ముక్కు కారడం, గొంతు నొప్పి, దగ్గు, ఒళ్లు నొప్పులు, చలి జ్వరం వచ్చే అవకాశం ఉందన్నారు. వీట ినివారణకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, దోమల బారిన పడకుండా దోమతేరలు వాడడం అలవరుచు కోవాలన్నారు. వేడినీళ్ల ను తాగాలని, వేడి అన్నాన్ని స్వీకరించాలన్నారు. చలి మంచు ఎక్కువగా ఉన్న సమయంలో ఇంటి నుండి వెలుపలకు రారాదని, శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చలి వల్ల కీళ్ల నొప్పులు, వాపులు పెరుగుతాయన్నారు. చెవి ఇన్ఫెక్షన్లు అధిక చలి కారణంగా వస్తాయని తెలిపారు. శ్వాసకోశ సమస్యలు వస్తాయని, వీటి నివారణకు జాగ్రత్తలు అవసరం అన్నారు.

ముక్కంటి సేవలో డీఆర్డీవో మాజీ చైర్మన్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

డి ఆర్ డి ఓ మాజీ చైర్మన్ సతీష్ కుమార్ రెడ్డి శనివారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ ఈవో బాపిరెడ్డి సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.



అలిపిరిలో టీటీడీ భూములపై కార్పొరేట్ దాడి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి అలిపిరి సమీపంలోని దేవలోక్ ప్రాంతంలో టీటీడీకి చెందిన పవిత్ర భూములను కార్పొరేట్ హోటల్‌కు కేటాయించడం ఘోర అపచారమని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె. నారాయణ విమర్శించారు. నాడు దేవస్థానం భూములను కాపాడిన ఫలితంగానే నేడు అవి విద్యాలయాలకు, ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడుతున్నాయని ఆయన గుర్తు చేశారు. అలాంటి భూమిని ఇప్పుడు సాంకేతిక ముసుగులో కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం తాము ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమన్నారు. శనివారం తిరుపతి అలిపిరి సమీపంలోని దేవలోక్ వద్ద ఒబెరాయ్ హెూటల్‌కు కేటాయించిన భూమిని కె. నారాయణ పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను క్షుణ్ణంగా పరిశీలించి, అనంతరం మీడియాతో మాట్లాడి తమ అభ్యంతరాలను స్పష్టంగా వెల్లడించారు. ఈ భూమంతా పూర్తిగా టీటీడీ పరిధిలోదేనని, నేరుగా ఇవ్వలేక టూరిజం లేదా ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు ఇచ్చినట్లు చూపించి, అక్కడి నుంచి ఒబెరాయ్ హెూటల్ గ్రూప్‌కు సుమారు 25 ఎకరాలు కేటాయిస్తున్నారని ఆరోపించారు. ధర ఎంత, లంచాలు ఎంత అన్నది పక్కనపెడితే, అసలు దేవస్థానానికి చెందిన భూమిలో స్టార్ హెూటల్ ఎలా కడతారని ప్రశ్నించారు. స్టార్ హెూటల్ అంటే పబ్‌లు, బార్లు, మాంసాహారం ఉంటాయని, ఇలాంటి వాటిని దేవుడు ఒప్పుకుంటాడా అని వ్యాఖ్యానించారు. గతంలో వైసీపీ హయాంలోనూ ఇలాంటి ప్రయత్నం జరిగితే, టీడీపీ, భక్తులు, ప్రజలు వ్యతిరేకించారని గుర్తు చేశారు. అప్పుడు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆ నిర్ణయాన్ని రద్దు చేయడంతో తాము స్వాగతించామని తెలిపారు. ఇప్పుడు పేరు మార్చి మళ్లీ అదే నిర్ణయం తీసుకోవడం విడ్డూరమని, ఇది టీటీడీ దివాలా విధానానికి నిదర్శనమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకష్ణ పాల్గొన్నారు.



ఒబెరాయ్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తూ...

నగరాభివృద్ధికి కృషి : ఆరణి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నగరాభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నామని ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు అన్నారు. 50వ డివిజన్ పరిధిలోని గరుడాద్రినగర్‌లో 27 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును శనివారం ప్రారంభించారు. అనంతరం భూపాల్ హౌసింగ్ కాలనీలో రూ.16.65 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. పార్కులో 8 లక్షలతో నిర్మించనున్న వాకింగ్‌ట్రాక్, కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. రూ.24 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డుకు భూమిపూజ చేశారు. నెహ్రూవీధిలో రూ.2050 లక్షలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను ఇంజినీరింగ్ అధికారులు, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి పులుగోరు మురళితో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ శ్యాంసుందర్, ఈఈ తులసి కుమార్, డిఇ వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

వివాదాలకు నిలయంగా విశ్వవిద్యాలయాలు

ప్రజాదృష్టి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

జ్ఞానాన్ని పెంపొందించి, జీవనోపాధికి మార్గాలని చూపించి, విలువలతో కూడిన విద్యా నిలయాలుగా పరిఢవిల్లాల్సిన విశ్వవిద్యాలయాలు, ఇటీవల కాలంలో వివాదాలకు నిలయంగా మారడం శోచనీయం. విద్యాహబ్‌గా ఎదుగుతున్న తిరుపతి ఇందుకు కేంద్రం కావడం గమనార్హం.

తిరుపతి. ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేయాల్సిన పని లేని ప్రాంతం. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువైన ప్రదేశం. ఇంతటి ప్రాముఖ్యత గల ప్రాంతం ఆధ్యాత్మికంగానే కాదు, అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని పెంపొందించే విద్యా కేంద్రంగా ఎదుగుతోంది. ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా ఎనిమిది విశ్వవిద్యాలయాలకు ఈ ప్రాంతం నిలయం. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, వేద విశ్వవిద్యాలయం(వేదిక్), భారతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన విశ్వవిద్యాలయం (స్విమ్స్ యూనివర్సిటీ), మోహన్ బాబు విశ్వవిద్యాలయం (ఎంబియు) వంటి విశ్వవిద్యాలయాలతో పాటు, వందలాది డిగ్రీ, ఇంటర్మీడియట్ కళాశాలలు, వేలాది పాఠశాలలు నెలకొల్పిన ప్రదేశం తిరుపతి. అందుకే దీనిని ఎడ్యుకేషన్ హబ్ అని పిలుస్తుంటారు. ఈ విశ్వవిద్యాలయాలన్నీ నిత్యం వేలాది మందిని పట్టాభద్రులుగా తయారు చేస్తుంటాయి. విలువలు నేర్పిస్తూ, విజ్ఞానాన్ని అందిస్తూ, జీవనోపాధికి మార్గాలను చూపిస్తుంటాయి. అలాంటి విశ్వావిద్యాలయాలు ఇటీవల కొంతమంది విపరీత ధోరణి కారణంగా వివాదాలకు నిలయంగా మారుతున్నాయి. మతతత్వ శక్తులు వివాదాన్ని రగిలిస్తున్నాయి.

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ భూతం పడగవిప్పింది. సాక్షాత్తు ఓ ప్రొఫెసర్ అండతో జూనియర్ విద్యార్థులపై ర్యాగింగ్ పేరుతో దాడి చేసి హింసించిన ఘటన వెలుగు చూసింది. బాధితులు పోలీస్ స్టేషన్‌మెట్లు ఎక్కడం కేసులు పెట్టడం, దీనికి కారణం అయిన ప్రొఫెసర్ ను సస్పెండ్ చేయడం, పట్టుమని పది రోజులు జరగ కుండానే పాలకుల అండతో తిరిగి విధుల్లోకి తీసుకోవడం చక చక జరిగిపోయాయి. సంస్కృత విశ్వవిద్యాలయంలో ఇద్దరు కీచక ప్రొఫెసర్లు ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించి, నగ్న వీడియోలు తీసి, భయపెట్టి బెదిరించి బలాత్కారం చేసి, గర్భవతిని చేశారు. ఈ ఘటనతో ఆ విద్యార్థి చదువు మానేసి, సొంత రాష్టానికి వెళ్లి, కుటుంబ సభ్యుల ధైర్యంతో అక్కడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఇలాంటి ఘటనలు మరవక ముందే తాజాగా శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో మరో మత విద్వేషాన్ని రగిల్చారు. క్రిస్టియన్స్ సోదరులకు అత్యంత ముఖ్యమైన క్రిస్మస్ పండగను పురస్కరించుకుని కొంతమంది విద్యార్థులు క్రిస్మస్ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థి శాంతా క్లాస్ వేషధారణలో కనిపించడంతో కొంతమంది మతతత్వ శక్తులు హిందూ విద్యార్థులను ఉసిగొల్పి, విశ్వవిద్యాలయం ముందే దాడులకు తెగపడ్డాయి. విశ్వవిద్యాలయాలలో మతతత్వ శక్తులు విద్వేషాలు రెచ్చగొడుతున్నాయని, ఇది సరైనది కాదని, విద్యార్థుల సంఘాలు ఏకకంఠంతో వీటిని ఖండించాయి. విద్యార్థులు సమన్వయం పాటించడంతో రగడ పెద్దది కాకుండా సద్దుమణిగింది. ఇలా తరుచూ విశ్వవిద్యాలయాలు వివాదాలకు కేంద్రాలుగా మారుతుండటం శోచనీయం. మతతత్వ శక్తుల పాలనలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం గమనార్హం. విజ్ఞాన కేంద్రాలుగా ఎదగాల్సిన విశ్వవిద్యాలయాల్లో ఎలాంటి ఘటనలు లేకుండా, మతతత్వ శక్తులను దూరంగా ఉంచి, విద్యార్థులను కాపాడాల్సిన బాధ్యత ఆయా వైస్‌ఛాన్సలర్లపై ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకొని విద్యార్థులకు విద్యను అందించి, విలువలతో కూడిన వ్యక్తులుగా తయారు చేసి పట్టాబద్రులుగా పంపించడంలో చురుకైన పాత్ర వహిస్తాయని ఆశిద్దాం..!

వృద్ధులకు క్రిస్మస్ కానుకలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక గివింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ వృద్ధాశ్రమ వృద్ధులకు జర్మనీకి చెందిన విక్టోరియా శనివారం క్రిస్మస్ కానుకలు అందజేశారు. వారితో కలిసి క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. నూతన వస్త్రాలను అందజేశారు. నిరాశ్రయులైన వృద్ధులకు ఆశ్రయంతో భోజన వసతి కల్పిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు దీపికను విక్టోరియా అభినందించారు.


ఎమ్మెల్యే చొరవతో గ్రామీణ రోడ్లకు శోభ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం, తిరుమండ్యం నుండి అప్పలాయగుంటకు వెళ్లే రోడ్డు గుంతల మయంగా ఉండటంతో నిత్యం ప్రజలు ఇబ్బంది పడేవారు. ఈ విషయమై ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ చొరవచూపి, నాబార్డ్ ద్వారా రూ. 77 లక్షల నిధులు మంజూరు చేయించి, శంకుస్థాపన చేసి రోడ్డు పనులు ప్రారంభించారు. తారు రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంట్రామూరల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఇంట్రామూరల్ టోర్నమెంట్ మ్యాజిక్ బస్ మండలేజ్ శ్రీ సిటీ వారి ఆధ్వర్యంలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు రమణయ్య ఈ ప్రాజెక్టు ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని, ఆటలతో క్రమశిక్షణ, నైపుణ్యత పెరుగుతుందని తెలియజేశారు. పిల్లలకి వాలీబాల్, కబడ్డీ క్రీడల్లో శిక్షణ ఇచ్చి, వారిని రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీలకు తీసుకెళ్లడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని కోచ్ రాంబాబు తెలిపారు.

రమణారెడ్డికి సత్కారం



ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు : టిడిపి సీనియర్ నాయకులు, రంగన్నగారిగడ్డ మాజీ సర్పంచ్ టిడిపి చిత్తూరు పార్లమెంట్ కమిటీ అధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా టిడిపి మండల క్లస్టర్ ఇంచార్జ్ కొట్టె శివకుమార్ ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ తన పై నమ్మకం ఉంచి పదవీ బాధ్యతలు ఇచ్చిన ఎమ్మెల్యే పులివర్తి నానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునస్వామి నాయుడు, కోటబైలు నాయకులు మదనమోహన్ బాబు రెడ్డి, చంద్రబాబు, టిడిపి వెంకీ, గువ్వల నాగిరెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కేరళ రాష్ట్రంలోని కాసరగూడలో జరిగిన జాతీయ స్థాయి 37వ సబ్ జూనియర్ స్థాయి టెన్నికాయిట్ పోటీలలో విజేతలుగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ టెన్నికాయిట్ క్రీడాకారులను తిరుపతి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బండి శ్యామసుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్) సత్కరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ టెన్నికాయిట్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ, టెన్నికాయిట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా టెక్నికల్ కమిటీ చైర్మన్ కె.ఎస్.వి సత్యనారాయణ, టీం మేనేజర్ పి.శివయ్య, చీఫ్ కోచ్ నేషనల్ రెఫరీ కె.రమేష్‌లను ఘనంగా సన్మానించారు. ఈయన వెంట అసోసియేషన్ ఉపాధ్యక్షులు పైడి కోటేశ్వర రావు, ఈ.సి మెంబర్లు విజయ లక్ష్మీ తదితరులున్నారు.

షణ్ముగం రెడ్డికి సన్మానం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నూతనంగా ఎన్నికైన చిత్తూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షణ్ముగ రెడ్డిని, పుత్తూరు పట్టణంలో బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ నాయుడు, సభ్యులు, టిడిపి నాయకులు వారి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భాస్కర్ నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బీసీలను గుర్తించి జిల్లా పదవులు చేసి బీసీల పక్షపాతిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పిఎసిఎస్ ఎస్ చైర్మన్ అమరేంద్ర నాయుడు, ఎఎంసి వైస్ చైర్మన్ సుధాకర్ ఏఎంసి డైరెక్టర్ జగదీష్ గురుణం, చిట్టెమ్మ, నీలిమ హరి, టీడీపీ నాయకులు చైతన్య, మధు నాయుడు, లోకనాథ నాయుడు, విక్రమ్ కరియప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా నిరుపయోగ సెల్ టవర్



ప్రజాశక్తి - బాలాయపల్లి: మండలంలోని జయంపు నడిబొడ్డున ఉన్న ఓ నిరుపయోగ సెల్ టవర్ ప్రమాదభరితంగా మారింది. నివాసాలకు అతి దగ్గరలో ఉన్న సెల్ టవర్ వద్ద గుట్టలుగా పొదలు పెరిగి పాములకు నిలయంగా మారింది. సెల్ టవర్ దగ్గర ఉండే జెనరేటర్ తర్వాత కొన్నేళ్లుగా బయటపడి ప్రమాదాలకు తావుగా మారాయి. ఇలా సెల్ టవర్ నిరుపయోగంగా ఉండటంతో అక్కడ పిచ్చి మొక్కలు, గుబురు చెట్లు పెరిగి విష సర్పాలకు నిలయంగా మారింది. సెల్ టవర్ వినియోగంలో ఉంటే ఆ పరిసరాలను టెక్నీషియన్లు శుభ్రపరుస్తూ ఉంటారు. సంవత్సరాలు తరబడి ఇలా నిరుపయోగంగా ఉండడంతో అపరిశుభ్రంగా, విష కీటకాలకు తవుగా మారిందని స్థానికులు తెలిపారు. జిల్లా యంత్రాంగం దృష్టి సారించి ఆ టవర్‌ను తొలగించాలని కోరుతున్నారు.

ఫొటో, వీడియోగ్రఫీపై శిక్షణ

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి, యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ జనవరి 5వ తేదీ నుండి 31 రోజుల పాటు పురుషులకు, మహిళలకు ఉచితంగా ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీల పై శిక్షణ కార్యక్రమం ప్రారంభించుచున్నట్టుగా సంస్థ డైరెక్టర్ సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగి, చిత్తూరు, తిరుపతి జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 సంవత్సరాలనుండి 50 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ పురుషులు, మహిళలు అర్హులని, 10వ తరగతి పాసై ఉండాలని తెలిపారు. వివరాలకు 7989680587, 9494951289, 6301717672 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పీజీ 3వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ



ప్రజాశక్తి - క్యాంపస్ : 31 నుంచి నుంచి జనవరి 7వరకు జరిగే యూజీసీ నెట్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని యస్వీయు లో జనవరి మొదటి వారంలో నిర్వహించనున్న పీజీ మూడవ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని, సంక్రాంతి సెలవుల తర్వాత పరీక్షలు నిర్వహించాలని వర్సిటీ రెక్టార్ సీ.హెచ్. అప్పారావుకు ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం వినతిపత్రం ఇచ్చారు. విద్యార్థుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన రెక్టార్ అప్పారావు జనవరి 20వ తేదీ తర్వాత పీజీ మూడవ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని హామీ ఇవ్వడంతో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వర్సిటీల కో–కన్వీనర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం పీజీ మూడవ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులందరూ యూజీసీ నెట్ పరీక్ష రాయడానికి అర్హులేనని, చాలామంది విద్యార్థులు ఇప్పటికే యూజీసీ నెట్‌కు సిద్ధమవుతూ పరిశోధన (రిసెర్చ్) దిశగా ముందుకు వెళ్తున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఎన్టీఏ నిర్వహించే యూజీసీ నెట్ పరీక్ష తేదీలు దాదాపు నెల ముందే ప్రకటించినప్పటికీ, వాటిని పరిగణనలోకి తీసుకోకుండా పీజీ పరీక్షల షెడ్యూల్ ప్రకటించడం సరికాదన్నారు. యూజీసీ నెట్ పరీక్షలు సంవత్సరానికి రెండుసార్లు నిర్వహించబడుతాయని, ఆ కాలంలో పీజీ విద్యార్థులకు పరీక్షల ఒత్తిడి లేకుండా అకడమిక్ ప్రణాళిక రూపొందించాలని వర్సిటీ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధ్యక్షుడు నరసన్న, సభ్యులు మాతేశ్వరి, ఆఫీస్ బేరర్స్ తిరుమలేష్, భాను, వాసు, షేక్షావలి, శ్రీను నాయక్, వేణుగోపాల్, రాజు, మంజుల బాయి, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి పట్టాలివ్వండి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గంలో ఇళ్ళు లేని నిరుపేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని, దుస్థితిలో ఉన్న రోడ్లు నిర్మించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లును కోరారు. శనివారం జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ఆదిమూలం తిరుపతి కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కోనేటి సుమన్ కుమార్ ఎరికంబట్టుకు రోడ్డున్నిర్మించాలని, నారాయణవనం, ఎన్టీఆర్ కాలనీలో మిగిలి ఉన్న భూమిలో పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పిచ్చాటూరు మండలం ఎస్ఎస్‌బి పేట లో ఉన్న భూమిని పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని, అలాగే నియోజకవర్గంలో ఇళ్ళు లేని నిరుపేదలను గుర్తించి ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న వీఆర్వో పోస్టులను భర్తీ చేయాలని ఎమ్మెల్యే కోరారు. తమ వినతులపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అడ్డగోలు నిర్ణయాలే భూ వివాదాలకు కారణం


ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: గత వైసీపీ పాలకుల అడ్డగోలు నిర్ణయాలు, అరాచకాల వల్లే నేడు గ్రామాల్లో ఎక్కడ చూసినా భూ వివాదాలు ఉత్పన్నమై రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గారు విమర్శించారు. పట్టణంలోని తన నివాసంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా సీఎం కృషి చేస్తున్నారని తెలిపారు. భూ వివాదాల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా 'రెవెన్యూ క్లినిక్‌లు' ఏర్పాటు చేసి వేగంగా సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ప్రజా దర్బార్‌లో అందిన వినతులను సంబంధిత శాఖలకు సిఫారసు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

కూరపాటికి.. కందేరి ధన్యవాదాలు



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: టీడీపీ తిరుపతి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్‌గా కందేరి కార్తీక్ చౌదరికి బాధ్యతలు అప్పగించిన సందర్భంగా, ఈ నియామకానికి సహకరించిన టీడీపీ సత్యవేడు నియోజకవర్గ పార్టీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డిని పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కందేరి కార్తీక్ చౌదరి మాట్లాడుతూ, పార్టీ పెద్దలు నాపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు, సహకరించిన కూరపాటి శంకర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లేందుకు మీడియా విభాగం ద్వారా పనిచేస్తానని తెలిపారు. కూరపాటి శంకర్ రెడ్డి మాట్లాడుతూ, టీడీపీ బలోపేతంలో మీడియా పాత్ర కీలకమని, నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలకు పార్టీ ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సతీష్ నాయుడు, మున స్వామి యాదవ్, పిచ్చటూరు పిఏసిఎస్ చైర్మన్ జయచంద్ర నాయుడు, మోహన్ రెడ్డి, ప్రణీత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతి సుధాకు డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం విద్యా విభాగం పరిశోధనా విద్యార్థి ఎన్.శాంతిసుధాకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు డీన్ అఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా విభాగం ఆచార్యులు అనురాధ మార్గదర్శకత్వంలో " ఇంపాక్ట్ అఫ్ సోషల్ నెట్వర్కింగ్ సైట్స్ ఆన్ ఇంటర్ పర్సనల్ స్కిల్స్ అండ్ అకాడమిక్ పెర్ఫార్మెన్స్ అమాంగ్ ఫ్రీ యూనివర్సిటీ కాలేజ్ స్టూడెంట్స్ ఆఫ్ తిరుపతి సిటీ " అను అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఇందుకు గాను ఆమెకు డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. ఆమె పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్ లలో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించారు. ఈ సందర్భంగా ఎన్.శాంతి సుధాను పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

జాకీర్ బాషాకు అభినందన



ప్రజాశక్తి - పాకాల: జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని చంద్రగిరి బాలికల కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో పాకాల బాలురు కళాశాలకు చెందిన జాకీర్ భాషా ద్వితీయ బహుమతి సాధించాడు. 3000 రూపాయల ప్రైజ్ మనీని కమిషన్ ప్రెసిడెంట్ టి.స్నేహలతారెడ్డి అందజేశారు. విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ కామర్స్ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న జాకీర్ భాష ఇంగ్లీష్ మీడియంలో వ్యాసరచన పోటీలో జిల్లాస్థాయిలో బహుమతి సాధించడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

శివుని సేవలో పొన్నుమల్లె ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తమిళనాడు రాష్ట్రం, పొన్నుమల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే కృష్ణస్వామి శనివారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు బుల్లెట్ జయశ్యామ్ రాయల్ స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. స్వామి, అమ్మవార్ల దర్శనం అనంతరం వేద పండితులచే ఆశీర్వచనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. జస్వంత్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

బండారుపల్లిలో గుజరాత్ ప్రతినిధులు

ప్రజాశక్తి-ఏర్పేడు: బండారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం చేపడుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం గుజరాత్ ప్రతినిధులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని పాఠశాల ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం తెలిపారు. అలాగే వివిధ పథకాల తీరును అడిగి తెలుసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చిట్టిబాబు, ద్వారకనాథరెడ్డి, కుమార రాజా, రాధాకుమారి, రామచంద్రయ్య, వెంకటేశులు పాల్గొన్నారు.

నూతన సంవత్సరంలో విద్యార్థులు లక్ష్యాలు సాధించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : నూతన సంవత్సరంలో విద్యార్థులు గొప్ప లక్ష్యాలు సాధించాలని కౌటిల్య శిక్షణ సంస్థ డైరెక్టర్ శ్రీధర్ సూచించారు. తిరుపతి, ఎం.ఆర్.పల్లి సర్కిల్ వద్ద ఉన్న కౌటిల్య ఇన్స్టిట్యూషన్‌లో శనివారం జరిగిన 'కొత్త సంవత్సరం లో కొత్త లక్ష్యాలు' అనే సెమినార్‌లో భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.సత్యనారాయణరాజు, ధరణి అబాకస్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ ఎమ్.రవి కుమార్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు, ఇతర కేంద్ర ప్రభుత్వ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు నూతన సంవత్సరంలో విజయాన్ని సాధించేందుకు, ఒత్తిడిని అధిగమించేందుకు అవసరమైన సలహాలు ఇచ్చారు. కౌటిల్య సంస్థ నూతన సంవత్సర డైరీని డాక్టర్ ఎన్.సత్యనారాయణరాజు, నూతన సంవత్సర క్యాలెండర్‌ను రవికుమార్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరాజు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన అంతర్గత స్పృహ అంటే అంతర్గత శక్తి పై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఎమ్.రవి కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్య కన్నా క్రమ శిక్షణ చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్, సీనియర్ మేనేజర్ ఎన్.ఎస్.రెడ్డి, ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

తలకోనలో నూతన సంవత్సర వేడుకలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: రాబోవు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని తలకోనకు విచ్చేయు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తలకోన ఆలయ ఈవో రవీందర్ రాజు తెలిపారు. శనివారం ఎస్పై బీవీ లోకనాథం భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

ముక్కంటి భక్తురాలు అదృశ్యం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ముక్కంటి దర్శనార్థం శ్రీకాళహస్తికి వచ్చిన ఓ భక్తురాలు అదృశ్యమైంది. తెలంగాణా, నిజామాబాద్ జిల్లా, బాలకొండ గ్రామానికి చెందిన పూసాని (60) శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చింది. దర్శనానంతరం భిక్షాల గాలి గోపురం వద్ద బస్సు కోసం ఎదురు చూస్తూ అక్కడ నుంచి అదృశ్యమైంది. బంధువుల ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిసిన వారు సెల్ : 9848139707, 7416875970 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

పోరాటాలు చేస్తే కేసులా..!



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అనకాపల్లి జిల్లా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న అప్పలరాజుపై పీడీ యాక్ట్ పెట్టడం దారుణమని, రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత పేర్కొన్నారు. శనివారం పుత్తూరు పట్టణంలోని స్థానిక కార్వేటి నగర్ రోడ్డులో రైతు సంఘం నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాలకు హాని కలిగించే బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న అప్పలరాజును ఉద్దేశపూర్వకంగా పీడీ యాక్ట్ పెట్టి, అడ్డు తొలగించుకోవాలని ప్రభుత్వం భావించడం దారుణమన్నారు. ఎస్సీ, ఎస్టీ పేద రైతుల భూములను కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ పోరాటం చేస్తున్నారు. ఇది జీర్ణించుకోలేని ప్రభుత్వం ఆయన మీద పీడీ యాక్ట్ పెట్టి జైలు పాలు చేశారని మండి పడ్డారు. పీడీ యాక్ట్ ఉద్యమకారులపై పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. పుత్తూరు సిపిఎం నాయకులు ఆర్.వెంకటేష్, సిపిఐ కార్యదర్శి మహేష్‌లు మాట్లాడుతూ ప్రజల పక్షాన పోరాటం చేసే వారిపై అక్రమ కేసులు పెట్టడం పరిపాటేనని, దాన్ని లెక్కపెట్టి 19 కేసులు ఉన్నాయి కాబట్టి అతనిపై పిడి యాక్ట్ పెట్టడం అన్యాయమని ఖండించారు. వెంటనే అప్పలరాజుపై పెట్టిన పీడీ యాక్ట్ ను తీసివేయాలని, అతన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా ఉద్యమాలతో బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముని శంకర్, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

రీసర్వేపై అవగాహన

ప్రజాశక్తి -కోట : కోట మండలం, చెందోడు, రైతు భరోసా కేంద్రంలో శనివారం రీ సర్వే ప్రాజెక్ట్‌పై గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోట మండల తహశీల్దార్ కే.జయ జయ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రైతుల సమస్యలను గుర్తించి, పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రీ సేర్వే చేపటిందని తెలిపారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జనవరి 2 నుంచి కోట మండల పరిధిలోని చెందోడు, గూడలి, మద్దాలి, రుద్రవరం, సిద్దవరం గ్రామ పంచాయతీల పరిధిలో ఈ సర్వే జరుగుతుందన్నారు. రీ సర్వేకు ప్రతి రైతు వారి భూములకు చెందిన వివరాలను పట్టాదారు పాసు బుక్కు లేదా అనుభవం గల రసీదు ఎలాంటి ఆధారం ఉన్న వాటితో పాటు ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, ఫోటోలు తీసుకు రావలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కే.జే జే రావు, డిప్యూటీ తహశీల్దార్ ఏ.మల్లికార్జున్ రావు, మండల సర్వేయర్ గోపిరెడ్డి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వోలు మహీధర్, సుబ్రహ్మణ్యం, సర్వేయర్ లీలా మోహన్, టిడిపి నాయకులు బందెల రఘురామ్, మాజీ ఎంపీటీసీ బాలసుబ్రమణ్యం, చల్లా కృష్ణ, మేకల శ్రీనివాసులు, నీటి సంఘం అధ్యక్షులు వేణుంబాక మాధవ కృష్ణారెడ్డి, చెందోడు గ్రామ కమిటీ కార్యదర్శి పి.సుధాకర్ రెడ్డి ,రైతులు పాల్గొన్నారు.

పల్లి శేషయ్యకు నివాళి



ప్రజాశక్తి - నాయుడుపేట: సూళ్లూరుపేట నియోజకవర్గం, నాయుడుపేట మున్సిపాలిటీ పరిధి, విన్నమాల గ్రామంలో గుండ పోటుతో కన్నుమూసిన జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్త పల్లి శేషయ్యకు శనివారం పలువురు జనసేన పార్టీ నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం రాత్రి శేషయ్య మృతి చెందారన్న సమాచారం తెలుసుకున్న సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్, నాయుడుపేట ఎఎంసి చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ ఆదేశాల మేరకు శనివారం జనసేన పార్టీ సీనియర్ నాయకులు అట్ల కృష్ణారావు, జనసేన పార్టీ నాయుడుపేట మండల అధ్యక్షులు గిండి సతీష్, జనసేన పార్టీ నాయకులు మహేంద్ర తదితర నాయకులతో కలసి శేషయ్య నివాసానికి చేరుకుని నివాళులుర్పించారు. శేషయ్య కుటుంబ సభ్యులకు సీనియర్ జనసేన పార్టీ నాయకులు అట్ల కృష్ణారావు పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. జనసేన పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు జనసేన నాయకులు బరోసా ఇచ్చారు. అనంతరం శేషయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.

భారతీయ విజ్ఞాన సమ్మేళనం భావితరాలకు మార్గదర్శకం

ప్రజాశక్తి - క్యాంపస్ : భారతీయ విజ్ఞాన సమ్మేళనం భావితరాలకు మార్గదర్శకం అని పలువురు వక్తలు పేర్కొన్నారు. "సమగ్రవికాసానికి భారతీయ చింతన" అనే భావనతో డిసెంబర్ 26 నుండి 29 వరకు నాలుగు రోజుల పాటు దేశంలోని 32 రాష్ట్రాలనుండి, కేంద్రపాలిత ప్రాంతాల నుండి వచ్చిన 1250 మంది ప్రతినిధులతో జరుగుతున్న భారతీయ విజ్ఞాన సమ్మేళనం రెండవరోజు కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. సదస్సుకి, ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య, వైద్య విద్య కుటుంబ సంక్షేమ మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ వైద్య వారసత్వానికి ప్రామాణికత చేకూర్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. విజ్ఞాన భారతి చేస్తున్న విశేష కృషిని ఆయన అభినందించారు. కార్యక్రమం చివరలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పునపాక లక్ష్మీ తెలిపారు. తిరుపతి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద శనివారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని పానబాక లక్ష్మి, సుగుణమ్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలు, వినతులను పానబాక లక్ష్మికి, సుగుణమ్మ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుండి వచ్చిన పలు వినతులపై సంబంధిత శాఖల అధికారులను వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, విద్యుత్, పింఛన్లు, గృహ నిర్మాణం వంటి ప్రజా సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా పానబాక లక్ష్మి మాట్లాడుతూ ప్రతి వినతిపై బాధ్యతాయుతంగా చర్యలు తీసుకొని, ప్రజలకు న్యాయం జరిగేలా అధికార యంత్రాంగం పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీ గీతాంజలి స్కూల్లో క్రీడోత్సవం



ప్రజాశక్తి - రామచంద్రాపురం : విద్యార్థులు విద్యతోపాటు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని రాష్ట్ర క్రీడ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఏ.రవి నాయుడు పేర్కొన్నారు. శనివారం ఆర్‌సి పురం, శ్రీ గీతాంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో, శ్రీ గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ క్రీడోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాప్ చైర్మన్ రవి నాయుడు, ఏ.ఎస్.పి రవి మనోహర్ ఆచారి, శ్రీ గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్ చైర్మన్ సురేంద్రాలు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాజ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ ప్రతి పోటీలోనూ గెలుపు ఓటమిలు సహజమేనని, నిరుత్సాహ పడక, పోటీతత్వంతో ముందుకు సాగితే విజయం తథ్యమన్నారు. ఏఎస్‌పి రవి మనోహర్ ఆచారి మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలతోనే శారీరిక దృఢత్వం, మానసిక ఉల్లాసం సాధ్యమన్నారు. పోటీలలో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ డాక్టర్ మాధవి, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, దీప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వన్నెరెడ్డి సేవాసంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ


ప్రజాశక్తి - రేణిగుంట: వన్నెరెడ్డి సేవాసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం చేతుల మీదుగా రెడ్డి సేవా సంఘం 2026 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమలరెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు గణేష్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, విఆర్ రావణ, గంగయ్య పాల్గొన్నారు.

క్రైం న్యూస్

చోరీకి విఫల యత్నం

ప్రజాశక్తి - పుత్తూరు : పుత్తూరు పట్టణంలోని, కార్వేటి నగరం రోడ్డుపై శుక్రవారం వేకువ జామున సుమారు 2.30 గంటల ప్రాంతంలో దొంగ వీరంగం సృష్టించాడు. రోడ్డుపక్కనున్న ఓ ఎలక్ట్రికల్ షాప్‌ను లక్ష్యంగా చేసుకుని, ముందుగా సీసీ కెమెరాలను ధ్వంసం చేశాడు. అనంతరం షట్టర్ లాకులను పగలగొట్టేందుకు యత్నించాడు. అయితే, దుకాణంలోని ఒక ప్రధాన లాక్ తెరుచుకోకపోవడంతో అతని పథకం పారలేదు. అనంతరం అదే రోడ్డులో, మరో నాలుగు దుకాణాల వద్ద కూడా షట్టర్ లాకులను పగలగొట్టి చోరీకి యత్నించాడని స్థానికులు తెలిపారు. కానీ ఏ దుకాణ లాకులు కూడా తెరచుకోక పోవడంతో దొంగ జారుకున్నాడు. ఈ ఘటనతో పట్టణంలోని వ్యాపారులు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు గస్తీ పెంచి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పేలి షెడ్డు దగ్ధం




ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ మండలం, కల్లివెట్ట గ్రామంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో హై వోల్టేజీతో అగ్ని ప్రమాదం సంభవించింది. కొద్ది కాలంగా విద్యుత్ అధిక ఓల్టేజీతో సతమతమవుతున్న గ్రామస్తులు ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు సమాచారం అందించినప్పటికీ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి స్థానికంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ హై వోల్టేజీతో ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో పరిసరాల్లో ఉన్న మోటార్ రివైండింగ్ షెడ్డు పూర్తిగా దగ్ధమైంది. గ్రామంలోని పలు ఇళ్లలో విద్యుత్ ఉపకరణాలు దాదాపు కాలిపోయాయని స్థానికులు తెలిపారు. ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహించారని, వారిని విధుల నుండి తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఘటనాస్థలిని ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఆర్ డబ్ల్యు ఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ వింద శనివారం పరిశీలించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో షెడ్డు పరికరాలు పూర్తిగా కాలిపోయినట్లు నిర్ధారించి, పై అధికారులకు తెలిపి నష్టపరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. విద్యుత్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోమని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలియజేశారు.

ఎర్రచందనం స్వాధీనం.. స్మగ్లర్ల అరెస్ట్



ప్రజాశక్తి - యర్రావారిపాలెం: ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లతో పాటు తొమ్మిది లక్షలు విలువ చేసే ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్టు భాకరాపేట అటవీ క్షేత్ర అధికారి ఎన్.వెంకటరమణ శనివారం విలేకరులకు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కోటకాడపల్లి పంచాయతీ దిన్నెల అటవీ ప్రాంతంలో శుక్రవారం ఎర్రచందనం అక్రమంగా రవాణా చేస్తున్నారని తన సిబ్బందితో కలిసి తలకోన నార్త్ బీట్ పరిధిలో విఆర్ కాలనీ దగ్గర నిఘా వేశామని తెలిపారు. శనివారం తెల్లవారుజామున కారును ఆపడానికి ప్రయత్నించగా కారు వేగంగా వెళ్లడంతో కారును చుట్టు ముట్టడంతో కొంతమంది కారును వదిలి పారిపోగా చుట్టుముట్టి కొంతమంది స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నామ న్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లు తమిళనాడు రాష్ట్రానికి చెందిన రాధా కుమార్, శక్తి వెల్ ముత్తు, బాబు దొరై రాజు, శక్తి, శివకుమార్ సంజీ, హనుమాన్ అనే స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. కారును పరిశీలించగా 6 ఎర్రచందనం దుంగలను ఉండగా వాటి బరువు167 కేజీలు ఉంటుందని 9 లక్షలు విలువ చేస్తుందని అధికారులు అంచనా వేశారు. పారిపోయిన వారికోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. ఈ దాడిలో ఎఫ్ ఎస్ ఓ, మునిస్వామి నాయక్, ఎఫ్‌బిఓలు, రాజేష్ కుమార్, ప్రదీప్ చాంద్, నిఖిల్, సదాశివయ్య, రవి, డ్రైవర్ శంకర్ మరియు ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని ఆటో ప్రయాణికుడు మృతి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఆసుపత్రికి వెళ్లేందుకు ఆటో ఎక్కిన గుర్తు తెలియని వ్యక్తి మార్గం మధ్యలో అకస్మాత్తుగా మృతి చెందిన ఘటన శనివారం చేసుకుంది. అలిపిరి ఎస్సై కథనం మేరకు కరకంబాడి రోడ్డు, మంగళం వద్ద ఓ వ్యక్తి రుయా ఆసుపత్రి పోవాలంటూ ఆటో ఎక్కాడు. లీలా మహల్ సమీపంలోకి రాగానే మూర్ఛ వ్యాధి రావడంతో క్రిందకు దిగిన వ్యక్తి స్థానికుల సహాయంతో ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందాడు. అలిపిరి పోలీసులకు సమాచారం అందడంతో మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. మృతుడిని ఎవరైనా గుర్తించిన ఎడల అలిపిరి పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.

ఆరుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని గూడూరు రూరల్ ఎస్ఐ తిరుపతయ్య హెచ్చరించారు. శనివారం గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు మండల పరిధిలోని విందురూలో మాజీ సీఎం జన్మదిన వేడుకల సందర్భంగా, అదే గ్రామానికి చెందిన సుబ్రమణ్యం, వివేకానంద రెడ్డి, సుమంత్, లోకేష్, వెంకట రామి రెడ్డి, శ్రీనివాసులు రెడ్డిలు మారణాయుధాలతో కేకులు కట్ చేస్తున్న పోటోలు, వీడియోలు తీసుకొని సోషల్ మీడియాలో రప రప్ప అని నరుకుతామని టీడీపీ వాళ్లకు మెసేజ్‌లు పంపారన్నారు. దీనితో గ్రామ ప్రజలను, టీడీపీ వాళ్లను భయబ్రాంతులకు గురిచేశారని ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా గ్రామాల్లో శాంతి, భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జరిమానా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మద్యం తాగి వాహనం నడిపినందుకు ఆరుగురు ద్విచక్ర వాహనదారులపై కేసు నమోదు చేసి, జరిమానా విధించినట్లు వన్ టౌన్ ప్రకాష్ కుమార్ తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలో శనివారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల్లో ఆరుగురు పట్టు పడగా వారికి న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్లు వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాంతకమనీ, ఇది చట్టరీత్యా నేరమనీ, రోడ్డు భద్రత కోసం ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఐ సూచించారు. డిసెంబర్ 31న మరిన్ని డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తామని హెచ్చరించారు.

వికసిత్ భారత్‌పై వ్యాసరచన పోటీ



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో శుక్రవారం వీర బాల దివస్ సందర్భంగా వికసిత్ భారత్ రూపకల్పనలో విద్యార్థులు పాత్ర, భేటి బచావో భేటి పడావో అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్ పరిశీలించారు. అనంతరం పాఠశాలలో విదార్థులకు ఇస్తున్న మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబు, ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, దాసు, జగన్నాధం, రమేష్, ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాదెండ్ల మురళి పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



ప్రజాశక్తి -ఏర్పేడు :బాల్య వివాహ రహిత ఏపీగా తీర్చిదిద్దాలని ఐసిడిఎస్, ప్రగతి సంస్థలు సంయుక్తంగా అంగనవాడి కార్యకర్తలకు మండల కేంద్రంలోని ప్రగతి భవనంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా జరిగినచో వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 కు ఫిర్యాదు చేయాలని సిడిపిఓ కృష్ణవేణి కోరారు. గ్రామీణ ప్రాంతాలలో పేదరికంతో..అవగాహన లేమి కారణంగా బాల్య వివాహాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు అంగన్వాడి టీచర్లు, స్వయం సహాయ సంఘాలు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ శిరీష, సూపర్వైజర్స్ భారతి, రత్నమ్మ, అనిత మరియు అంగన్వాడి కార్యకర్తల పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌తో సత్ఫలితాలు



సమీక్షలో డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగరాజు, ఎంఈఓ1 రవీంద్రనాథ్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: విద్యాప్రమాణాలు మెరుగు పరచడానికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగరాజు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రవాణా సౌకర్యం అంశంపై తల్లిదండ్రుల్లో ప్రత్యేక అవగాహన కల్పించడం అత్యంత అవసరమని గుత్తి త్యాగరాజు తెలిపారు. ఈ అంశంపై బుచ్చినాయుడు కండ్రిగ ఎం.ఈ.ఓ1 రవీంద్రనాథ్‌తో ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ, వాటి సద్వినియోగంపై కొంద రు తల్లిదండ్రుల్లో పూర్తి అవగాహన లేకపోవడం వల్ల ఆశించిన ఫలితాలు రాబట్టేందుకుకు ప్రత్యేక చర్యలు అవసరమని అభిప్రా యపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పడుతున్నాయని గుత్తి రాజు తెలిపారు. ఎం.ఈ.ఓ1 రవీంద్రనాథ్ మాట్లాడుతూ,విద్యార్థుల హాజరు శాతం పెరగాలంటే రవాణా సౌకర్యంపై తల్లిదండ్రుల సహకారం తప్పనిసరి అన్నారు.

విద్యా సామర్థ్యాలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:విద్యార్థుల సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకొని తరగతి గదిలో విద్యాబోధన చేయాలని మండల విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం సూచించారు. శనివారం ఆయన మండలంలోని పార్లపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం 9 పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులతో విద్యా బోధనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సృజనాత్మక బోధనతో పాటు వారి సామర్థ్యాలకు అనుగుణంగా విద్యాబోధన చేయాలన్నారు. ఫౌండేషన్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత పర్యావరణం కోసం ప్రజల ఐక్యపిలుపు



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, నేషనల్ సర్వీస్ స్కీం యూనిట్ వన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి.విశాలి ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ పరిదిలోని పాతకాల్వ గ్రామంలో శనివారం స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రపరిచారు. ఆపై ఎకో – సేవియర్స్ రవికుమార్, మార్కండేయుడు, శివయ్య పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. గ్రామంలోని పిల్లలు, వాలంటీర్లు ప్లకార్డులు చేతబట్టి ప్లాస్టిక్ దుష్ప్రభావాలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఆచార్య చండీ కుమారి యాంటీబయాటిక్స్ అనుచిత వినియోగం, సూక్ష్మజీవుల నిరోధకతను గురించి వివరించారు. వాలంటీర్లు గ్రామప్రజలకు నాటకాలు,పాటలు, ప్రసంగాల ద్వారా ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వేదాంతపురంలో....

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతికి చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్–6 ఆధ్వర్యంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.సంధ్య నాయకత్వంలో వేదాంతపురం గ్రామంలో సోలార్ సబ్సిడీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిందు మాధవి బృందం పాల్గొని, సోలార్ సబ్సిడీ ద్వారా పొందగల ఆర్థిక లాభాలు, దరఖాస్తు ప్రక్రియ, అర్హతలు మరియు ఇళ్లకు సోలార్ ప్యానెల్స్ ఎలా అమర్చుకోవాలో సవివరంగా వివరించారు. సోలార్ విద్యుత్ వాడకంతో విద్యుత్ ఖర్చులు తగ్గడం, పర్యావరణ పరిరక్షణ, పునరుత్పాదక శక్తి ప్రోత్సాహం వంటి ప్రయోజనాలను గ్రామస్థులకు తెలియజేశారు. గ్రామ ప్రజలు సోలార్ శక్తిని స్వీకరించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో 50 మంది ఎన్ఎస్–ఎస్ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్‌టియు తిరుపతి జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఎస్‌టియు తిరుపతి జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర సంఘ ఆదేశాలమేరకు ఎస్‌టియు భవన్ బైరాగి పట్టెడలో శనివారం ఆ సంఘ జిల్లా మాజీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమేష్ బాబు, జగన్నాథంలు ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా సి.వాసు (తిరుపతి రూరల్)అధ్యక్షులుగా వి.సుధాకర్ యాదవ్ (తొట్టంబేడు), ప్రధాన కార్యదర్శిగా మునికృష్ణ నాయుడు (తిరుపతి అర్బన్), ఆర్థిక కార్యదర్శిగా దేవేంద్ర యాదవ్ (నాగలాపురం), జిల్లా మహిళా కన్వీనర్ ద్రాక్షాయని (తిరుపతి అర్బన్), అసోసియేటివ్ అధ్యక్షులుగా మురళీకృష్ణ, రుక్మాంగధ, రత్నయ్య, చంగయ్య, జయ చంద్ర, శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా కొత్తకోట ప్రవీణ్, గోవర్ధన్, కృష్ణయ్య, రాజు రామచంద్ర, శివకుమార్, మల్లేశ్వర్, అమర్నాథ్ రెడ్డి, శ్రీనివాసులు. అదనపు ప్రధాన కార్యదర్శులుగా గుమ్మడి మురళి,బి.వెంకటేష్, కోటేశ్వరరావు, సురేష్, మధుసూదన్ రాజు. కార్యదర్శులుగా దేవరాజులు, ధన కిషోర్, చిన్నయ్య, డి.గౌరీ, నరసింహులు, ప్రభాకర్ రెడ్డి, నాగరాజు, కృష్ణమూర్తి, విజయ భాస్కర్, కె. గౌరీ. ఆర్థిక కమిటీ సభ్యులు గా ఝాన్సీ, మోతిలాల్, వాసు, వెంకటరత్నం. ఉపాధ్యాయ వాణి కన్వీనర్ గా వినోద్ కుమార్ తిరుపతి అర్బన్ ,సిపిఎస్ కన్వీనర్ గా సూర్య ప్రకాష్, మైనార్టీ కన్వీనర్‌గా ఎమ్మెస్ మేరీ. రాష్ట్ర కౌన్సిలర్లుగా, గాజులనాగేశ్వరరావు ,రామాంజనేయులు ,రేణుకాదేవి ,శ్రీనివాసులు తాళ్లూరి, రమేష్.బాబు ,వెంకటరమణ ,శ్రీనివాసరాజు ,హరికృష్ణ ,వాసు.ఆర్గనైజింగ్ సెక్రటరీస్ గా వెంకటా చలపతి, శేఖర్, లక్ష్మీ దీపక్, మల్లికార్జున్, లక్ష్మయ్య, స్టాలిన్, శ్రీహరి శారదమ్మ,రమణయ్య, శ్యామ్ తదితర కార్యవర్గ సభ్యులను జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారిని ఏకగ్రీవంగా ప్రకటించారు. రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతారని తెలిపారు.

ధ్యాన మందిరంలో మొక్కల నాటే కార్యక్రమం



ప్రజాశక్తి - క్యాంపస్ :తిరుపతిలోని నలందా నగర్ యోగోద సత్సంగ ధ్యానకేంద్రం (వైఎస్‌ఓకే) ఆధ్వర్యంలో వైఎస్‌ఓకే ధ్యాన మందిర ప్రాంగణంలో శుక్రవారం మొక్కలు నాటడం, పరిసరాల సుందరీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం శాంతియుత, ఆధ్యాత్మిక వాతావరణంలో సాగి, కేంద్ర భక్తులు, నలందా నగర్ కాలనీ నివాసితులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పుష్పించే, నీడనిచ్చే అనేక మొక్కలను నాటడంతో పాటు ధ్యాన మందిర పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ ఆర్.శిరీష, మేయర్, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్, పాత్రి శ్రీనివాస కుమార్, జోనల్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తిరుపతి, ప్రొఫెసర్ ఏ. సాంబశివ రెడ్డి, అధ్యక్షులు, లిమిటెడ్, నలందా నగర్, డాక్టర్ వై. రాఘవ రెడ్డి, సీనియర్ మెడికల్ ఆఫీసర్ (రిటైర్డ్), ఎస్వీయూ హెల్త్ సెంటర్, తిరుపతి హాజరయ్యారు.

గృహ పిఎన్‌జీ ధరలను తగ్గించిన థింక్ గ్యాస్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ బోర్డు (పిఎన్‌జీఆర్ బి) ఏకీకృత టారిఫ్‌ను సవరించిన నేపథ్యంలో, థింక్ గ్యాస్ ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి – చిత్తూరు ప్రాంతంలో (సివికే –1జిఏ) పిఎన్‌జీ ధరలను తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. దీంతో ఈ ప్రాంతంలోని కుటుంబాలకు స్వచ్ఛమైన వంట మరింత సరసమైనదిగా మారింది. ఈ సవరించిన ధరలు 2026 జనవరి 1 నుండి అమల్లోకి వస్తాయి. సవరించిన టారిఫ్ తేదీ నుండి, గృహ వినియోగదారుల కోసం పైపుల ద్వారా సరఫరా చేసే సహజ వాయువు (పిఎన్‌జీ) ధరను రూ. 4 ఎస్సిఎం తగ్గించారు, దీనితో రూ. 47 స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ (ఎస్సిఎం)కి చేరింది. సవరించిన ధరలు గృహ పొదుపును మెరుగుపరుస్తాయి , రోజువారీ వంటకు ఆర్థికంగా మరింత మద్దతు ఇస్తాయి. ఈ సందర్భంగా థింక్ గ్యాస్ చీఫ్ మార్కెటింగ్ అండ్ కమర్షియల్ ఆఫీసర్ వినుకుమార్ బాలకృష్ణన్ మాట్లాడుతూ, "పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ బోర్డు ఏకీకృత టారిఫ్‌ను సవరించడం వల్ల మేము మెరుగైన ధరలను వినియోగదారులకు అందించగలుగుతున్నాము. ఇది గృహాలు వంట ఖర్చులను మరింత సమర్థవంతంగా నిర్వహించుకోవడానికి సహాయపడుతుంది, మెరుగైన ఇంధన ఆర్థిక వ్యవస్థతో సీఎన్‌జీ వినియోగదారులకు మద్దతు ఇస్తుందన్నారు. "గృహాలకు, ఈ సవరించిన ధరలతో పిఎన్‌జీ ధరలలో దాదాపు 5–6 ఆదాకు తోడ్పడుతుంది. ఇతర ఇంధనాలకు పిఎన్‌జీ ఒక నమ్మకమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని తెలిపారు. ప్రభుత్వ, వాణిజ్య రవాణా ఆపరేటర్లతో సహ సీఎన్‌జీ వినియోగదారులకు, సవరించిన ధరల విధానం వ్యయ సామర్థ్యాన్ని పెంచుతుంది, అధిక ధర స్థిరత్వాన్ని అందిస్తుందన్నారు. పిఎన్‌జీఆర్బి ద్వారా సవరించిన టారిఫ్ ప్రయోజనాలను, పిఎన్‌జీ, సీఎన్‌జీ సురక్షితమైన వినియోగాన్ని గృహాలు, వాహన వినియోగదారులు మెరుగ్గా అర్థం చేసుకోవడానికి, సహాయపడటానికి, థింక్ గ్యాస్ ఈ ప్రాంతంలో వివిధ వినియోగదారుల అవగాహన, ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని యోచిస్తోందని తెలిపారు.

గ్రామ సమాఖ్య లీడర్లకు శిక్షణ



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ వెలుగు కార్యాలయంలో విఓఏలకు, గ్రామ సమాఖ్య లీడర్లకు జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఏపీయం మునెయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నిల్వ ఉండే ఆహార ఉత్పత్తులు తయారీ చేసేవారిని ప్రోత్సహించాలని సూచించారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీడ్ క్యాపిటల్ ద్వారా గ్రాంట్ ఇస్తారని ఈ మొత్తాన్ని స్త్రీ నిధి లో డిపాజిట్ చేసి, అక్కడ నుండి సభ్యులకు 50 పైసలు వడ్డీకి మొదటి విడత 4,000, రెండవ విడత 75,000 లోన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. బిస్కెట్స్, స్వీట్, కేక్స్, పచ్చళ్ళ, ఊరగాయలు, వివిధ రకాల నిల్వ ఉండే తినుబండారాలు తయారీ చేసే వారిని గుర్తించి, ప్రోత్సాహం అందించాలన్నారు. వ్యాపార విస్తరణకు కావలసిన మిషనరీ కొనుగోలు చేయడానికి అర్హత కలిగిన వారికి పిఎంఎఫ్ఎంఈ ద్వారా 35శాతం సబ్సిడీతో బ్యాంకు రుణాలు ఇప్పించడం జరుగుతుందని తెలియ జేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సిసిలు పయని, వెంకటరత్నం, జీవ, వీరజిన్న అకౌంటెంట్‌లు హిమగిరిజ, శిరీష, సంఘమిత్రలు, గ్రామ సంఘాలు లీడర్లు పాల్గొన్నారు.

ప్రజా రక్షణే ధ్యేయం : డీఎస్పీ గీతా కుమారి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా గూడూరు డీఎస్పీ గీతా కుమారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, సి.డి ఫైళ్లు, స్టేషన్ ప్రాంగణం పరిశుభ్రతను సవివరంగా పరిశీలించారు. అలాగే లా అండ్ ఆర్డర్ సమర్థవంతంగా నిర్వహించడం, ఆస్తి నేరాల గుర్తింపు, నియంత్రణపై సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఈమె వెంట గూడూరు రెండో పట్టణ సి. ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సీడ్ క్యాపిటల్‌పై అవగాహన



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళలకు సీడ్ క్యాపిటల్ పై వెలుగు పి.డి శోభన్ బాబు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పొదుపు సొమ్మును వ్యాపారాల్లో పెట్టుబడిగా పెట్టి ఆర్థికంగా ఎదగడానికి, అవసరమైన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐ.బి.డి.పి వెంకటేష్, హెచ్.డి. ఏ.పి.ఏం చంద్రబాబు, ఏ.పి.ఎం. బుజ్జమ్మ , సి.సి లు , పొదుపు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చెందోడులో నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -కోట : కోట మండలం చెందోడు గ్రామంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ అటల్ బీహార్ వాజ్ పాయ్ 100వ జయంతిని పురస్కరించుకుని రక్తదాన శిబిరం జరుగుతుందని ఎంవీ రావు ఫౌండేషన్ నిర్వాహకులు లీలా మోహన్ కృష్ణ తెలిపారు. కావున కోట,వాకాడు, చిట్టమూరు మండలాల్లోని రక్త దాతలు స్వఛ్ఛందంగా ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.రక్తదానం మరొకరికి ప్రాణదానం అని రక్తదానంపై అపోహలు వీడి ప్రజలు ప్రస్తుత అవసరాల అదృశ్య రక్తదానం చేయాలని రక్తదానం చేసేవారు సెల్ నెంబర్ 9440096224ను సంప్రదించాలని కోరారు.